పదోతరగతి తెలుగు

(తెలంగాణ సిలబస్)

# 8. లక్ష్యసిద్ధి

## పాఠంలో ముఖ్యాంశాలు

★ 'సుదీర్ఘ కాలం అణిచివేతకు గురైన జాతి ఆత్మ తన గొంతు వినిపిస్తుంది' దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పుడు నెహ్రూ అన్న మాట. ఈ మాట తెలంగాణకు అక్షరాలా సరిపోతుంది.

★ జూన్ ఒకటో తేదీ అర్ధరాత్రి ప్రపంచమంతా నిద్రిస్తున్న వేళ తెలంగాణ జాతి తన స్వాతంత్ర్య ప్రకటన చేసింది.

★ తెలంగాణ పోరాటం గమ్యాన్ని ముద్దాడిన క్షణాలు, జాతి చరిత్రలో అరుదైన క్షణాలు... తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు క్షణాలు.

★ ఆనందోత్సాహాలతోపాటు పోరాట జ్ఞాపకాలు కూడా గుర్తుచేసుకుని హృదయాన్ని ఆర్ద్రంగా మార్చాయి.

★ ఉద్యమం చివరి దశలో పరేడ్ గ్రౌండ్‌లో సభకు అనుమతి లభించలేదు ఇప్పుడు ఆ మైదానంలోనే తెలంగాణ ముఖ్యమంత్రి గౌరవ వందనం స్వీకరించారు.

★ ఆంక్షలు ఉన్న అప్పటి వీధులు **జై తెలంగాణ** నినాదాలతో కళకళలాడుతున్నాయి.

★ ఉస్మానియా క్యాంపస్‌లోని విద్యార్థులను లాఠీలతో కొట్టిన క్షణాలు దేశ విదేశాల్లోని బిడ్డలను కదిలించాలి.

★ వలస పాలకుల ఆంక్షల మధ్య లాఠీ దెబ్బలకు జడువక అమరవీరుల స్థూపం దగ్గరకు పరిగెత్తారు.

★ స్వరాష్ట్రంలో జాతి అంతా సర్వతోముఖాభివృద్ధికి పాటుపడాలి.

★ జీవన విధానాలను పునరుద్ధరించుకోవాలి. సమష్టి యజ్ఞంలా పునర్నిర్మాణం జరగాలి.

★ తెలంగాణ జనానికి ముందుగా కావాల్సింది కడుపు నిండా తిండి, కంటి నిండా నిద్ర, రేపటి గురించి బుగులు లేని జీవితం.

★ కేసీఆర్ ఇచ్చిన తొలి ప్రసంగం ఆశయ సాధనకు అనుగుణంగా ఉంది.

★ తెలంగాణకు నీటి పారుదల రంగంలో జరిగిన అన్యాయాన్ని చక్కదిద్దడం ఒక బృహత్కార్యం.

★ పరిపాలనా రంగంలో సంస్కరణలు ప్రవేశపెట్టడం అవసరం.

★ స్వతంత్ర్య తెలంగాణ అభివృద్ధి బాటలో పయనిస్తుంది. ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తుంది.

## పాఠం నుంచి పరీక్షలో రాదగిన ప్రశ్నలు

**1.** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో విద్యార్థుల పాత్ర గురించి రాయండి.

**2.** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వల్ల ఏయే సౌకర్యాలు అందుతాయని మీరు అనుకుంటున్నారు?

**3.** ఏదైనా ఒక సామాజిక అంశం/ సంఘటనపై సంపాదకీయ వ్యాసం రాయండి.

**4.** ఉద్యమ సమయంలో 'హైదరాబాద్' ప్రాముఖ్యాన్ని తెలపండి.

**5.** తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణంలో మీరెలాంటి పాత్ర పోషిస్తారు?

**పరీక్షలో రాదగిన భాషాంశాలు**

**అర్థాలు**

ఉద్యమకారులు = మార్పు కోసం ప్రయత్నం చేసేవారు

పథం = తొవ్వ, మార్గం

ఆర్ద్ర = తడిసిన

**పర్యాయ పదాలు**

పోరాటం = యుద్ధం, సంగ్రామం, సమరం

సంస్కరణ = బాగుచేయడం, చెడును రూపుమాపడం

విషాదం = బాధ, దుఃఖం

## వ్యాకరణాంశాలు

అ) ప్రత్యక్ష కథనంగా మార్చండి.

**1)** తెలుగులోనే రాయండని, తెలుగే మాట్లాడండని టీవీ ఛానెల్లో ప్రసారం చేశారు.

**జ:** "తెలుగులోనే రాయండి. తెలుగే మాట్లాడండి" అని టీవీ ఛానెల్లో ప్రసారం చేశారు.

ఆ) పరోక్ష కథనంగా మార్చండి.

**1)** "సుదీర్ఘ కాలం అణిచివేతకు గురైన జాతి ఆత్మ తన గొంతు వినిపిస్తుంది' అని జవహర్ లాల్ నెహ్రూ అన్నారు.

**జ:** సుదీర్ఘకాలం అణిచివేతకు గురైన జాతి ఆత్మ తన గొంతు వినిపిస్తుందని జవహర్ లాల్‌నెహ్రూ అన్నారు.

ఇ) విడదీసి, సంధి సూత్రం రాయండి.

i) అత్యద్భుతం = అతి + అద్భుతం – యణాదేశ సంధి

**సూత్రం:** ఇ, ఉ, ఋ లకు అసవర్ణమైన అచ్చులు పరమైనప్పుడు య, వ, రలు ఆదేశంగా వస్తాయి.

ii) సచివాలయం = సచివ + ఆలయం – సవర్ణదీర్ఘ సంధి.

**సూత్రం:** అ, ఇ, ఉ, ఋలకు అవే అచ్చులు పరమైనప్పుడు వాటి దీర్ఘాలు ఏకాదేశమవుతాయి.

**కింది పదానికి విగ్రహవాక్యం రాసి, సమాసాల పేర్లు రాయండి.**

అ) సంక్షేమ పథకాలు

సంక్షేమం కొరకు పథకాలు (చతుర్థీ తత్పురుష సమాసం)

**ఉ) కింది వాక్యంలోని అలంకారం గుర్తించండి.**

i) అభిరామ్ తాటిచెట్టంత పొడవు ఉన్నాడు.

**జ:** పై వాక్యంలో అతిశయోక్తి అలంకారం ఉంది.

**అతిశయోక్తి:** ఏదైనా ఒక వస్తువు/విషయాన్ని ఉన్నదానికంటే ఎక్కువచేసి చెప్పడమే **అతిశయోక్తి అలంకారం**.

**ఊ) కింది అలంకారాన్ని వివరించండి.**

i) స్వభావోక్తి అలంకారం

**జ:** విషయాన్ని ఉన్నది ఉన్నట్లుగా వర్ణించడాన్ని **స్వభావోక్తి అలంకారం** అంటారు.

**ఉదా:** జింకలు బిత్తర చూపులు చూస్తూ చెవులు నిగిడ్చి చెంగు చెంగున గెంతుతున్నాయి.

## మీకు తెలుసా?

**1969 – ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం:**

తెలంగాణ ప్రాంతానికి ఇచ్చిన కొన్ని రక్షణలు, షరతుల ప్రాతిపదికపై ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. 'పెద్దమనుషుల ఒప్పందం' అనే ఒక ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ప్రభుత్వానికి తగిన సిఫార్సులు చేసేందుకు ఒక ప్రాంతీయ సంఘం ఉండేది. పెద్దమనుషుల ఒప్పందం తూ.చ. తప్పకుండా అమలవు తుందని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. కానీ విఫలమైంది. ప్రజల నమ్మకానికి ద్రోహం జరిగింది. ప్రజల్లో పెద్దపెట్టున అసంతృప్తి చెలరేగింది. తెలంగాణ ప్రజలు ముక్తకంఠంతో ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని కోరుకున్నారు. స్వల్ప వ్యవధిలోనే ఇది స్వచ్ఛందమైన ఉద్ధృతమైన ప్రజా ఉద్యమంగా మారింది. గ్రామం మొదలుకుని నగరం వరకు అన్ని రంగాలకు చెందిన యువకులు, మహిళలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు అందరూ ఈ ఉద్యమంలో పాల్గొన్నారు. అప్పటి పత్రికలైన 'జై తెలంగాణ' , 'తెలుగుగడ్డ', 'తెలుగు వాణి' కూడా వీటికి తమ మద్దతు ప్రకటించాయి. ఈ సందర్భంలోనే తెలంగాణ ప్రజా సమితి, తెలంగాణ విమోచనోద్యమ సమితి లాంటి సంస్థలు ఆవిర్భవించాయి.

**రచయిత: జి.అంజాగౌడ్**